క్లుప్తంగా

టీటీడీ చైర్మన్‌కు సన్మానం



తిరుపతి అర్బన్: టీటీడీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని బుధవారం జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి పద్మావతి పురంలోని ఆయన స్వగృహంలో కలిశారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లికి సత్కారం



తిరుపతి మంగళం : వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని బుధవారం వెంకటగిరిలోని ఆయన స్వగృహంలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి కలిశారు. వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. శాలువాతో సత్కరించారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



చంద్రగిరి: మండలంలోని అగరాల పంచాయతీ బండకాడపల్లికి చెందిన సురేష్, అశ్విని వివాహం నిశ్చయమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని బుధవారం వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి, సర్పంచ్ భాస్కర్ రెడ్డి అందజేశారు.

నేడు చిన్నగొట్టిగల్లులో ఉచిత వైద్య శిబిరం

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దేవేంద్రబాబు తెలిపారు. మండలంలోని 13 పంచాయతీల్లో గతంలో నిర్వహించిన వైద్య శిబిరాల్లో పరీక్షలు చేయించుకోకుండా ఉన్నవారు వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: వివిధ దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కులను బుధవారం తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తుమ్మలగుంటలోని తన నివాసం వద్ద అందజేశారు. పాకాల మండలం దామలచెరువుకు చెందిన వైష్ణవికి రూ.5 లక్షలు, గణపతి రెడ్డికి రూ.60 వేలు మంజూరయ్యాయి.

కరాటే పోటీల్లో పతకాల పంట



పతకాలు, సర్టిఫికెట్లు, ట్రోఫీలతో కరాటే క్రీడాకారులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఈ నెల 2, 3 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తిరుపతి జిల్లాకు చెందిన 15 మంది క్రీడాకారులు పతకాల పంట పండించారు. కట, ఫైట్ విభాగాల్లో 9 బంగారు, 7 వెండి, పది కాంస్యం, పతకాలను సాధించారు. తిరుపతిక చెందిన బి.సింహాచలం ఓవరాల్ చాంపియన్‌షిప్ కప్పును కైవసం చేసుకున్నాడు. ఈ పోటీల్లో ఆరు రాష్ట్రాల నుంచి సుమారు 800 మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు.

వైభవంగా ఉట్లోత్సవం

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం యడమవారిపల్లెలోని శ్రీకృష్ణ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కృష్ణుడి వేషధారణలో పిల్లలు సందడి చేశారు. మధ్యాహ్నం ఉట్లోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని ఊరేగించారు.

అత్యుత్తమ ప్రమాణాలతో బర్డ్ అభివృద్ధి

తిరుపతి తుడా: అత్యుత్తమ వైద్య ప్రమాణాలతో బర్డ్ ఆస్పత్రిని అభివృద్ధి చేస్తున్నట్లు టీటీడీ జేఈవో సదాభార్గవి చెప్పారు. ఆమె బుధవారం వైద్యులు, అధికారులతో కలిసి బర్డ్ ఆస్పత్రిని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన అనేక మంది వైద్య నిపుణులు ఇక్కడికి వచ్చి పేదలకు మోకీలు, తుంటి మార్పిడి ఆపరేషన్లను ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. అంతకుముందు బర్డ్ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సదుపాయాలు, వైద్య సేవలను పరిశీలించారు. అత్యవసర వార్డు, జనరల్ వార్డు, ఎక్స్ రే, స్కానింగ్, ఓపీ వార్డుల్లో పలు సూచనలు చేశారు. అనంతరం డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. బర్డ్ ప్రత్యేకాధికారి డాక్టర్ రెడ్డెప్ప రెడ్డి, డాక్టర్లు వేణుగోపాల్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

సర్వ హక్కుల సంబరం

- క్రమబద్ధీకరణ ఆర్డర్స్‌ను అందుకున్న లబ్ధిదారులు
- కష్టాలు తీరాయని ఆనందం

తిరుపతి తుడా : తిరుపతి నగరంలో దశాబ్దాలుగా భూ సమస్యతో సతమతమవుతున్న వేలాది మంది ప్రజలకు బుధవారం విముక్తి లభించింది. 50 ఏళ్లుగా కొన్ని ప్రాంతాల్లో, ఏడెనిమిదేళ్లగా మరికొన్ని ప్రాంతాల్లోని భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలు ఆగిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పరిష్కరించారు. నిషేధిత జాబితా నుంచి ఆ భూములకు విముక్తి కలిగించి సర్వహక్కులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమమంలో క్రమబద్ధీకరణ ఉత్తర్వులను బుధవారం స్థానిక నెహ్రూ మున్సిపల్ హై స్కూల్ గ్రౌండ్‌లో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆన్‌లైన్ ద్వారా బటన్ నొక్కి లబ్ధిదారులకు ఉత్తర్వులు అప్‌లోడ్ చేశారు. మరి కొంతమందికి సభావేదికపై అందజేశారు.



హక్కుల పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, పక్కన కలెక్టర్, అధికారులు

చాలా సంతోషంగా ఉంది



ఏళ్ల తరబడి మా ఆధీనంలోని స్థలానికి హక్కు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. ఇళ్లు కట్టుకోవాలన్నా, అమ్ముకోవాలన్నా వీలులేకుండా పోయింది. మాకు సర్వహక్కులు కల్పిస్తూ ఎమ్మెల్యే పత్రాలు అందించారు. చాలా సంతోషంగా ఉంది.

– రత్నమ్మ, సంజీవయ్య నగర్, తిరుపతి

కలలో కూడా ఊహించలేదు



మా ఇంటిపై సర్వహక్కులు వస్తాయని కలలో కూడా ఊహించలేదు. మా ప్రాంతంలోని భూములను రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం రావడంతో స్థలాల విలువ నాలుగు రెట్లు పెరిగింది. ఎమ్మెల్యే భూమనకు, సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– మాధవి, సింగాలకుంట, తిరుపతి

రుణపడి ఉంటాం



మాకు ఆస్తి ఉన్నా రిజిస్ట్రేషన్‌కు నిషేధం ఉండడంతో ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు నిషేధాన్ని తొలగించడంతో ఇళ్లకు విలువ పెరిగింది. దీనికి నిరంతరం కష్టపడి, మా కుటుంబాల్లో వెలుగులు నింపిన, ఎమ్మెల్యే భూమన కుటుంబానికి రుణపడి ఉంటాం.

– పుష్పలత, నెహ్రూనగర్, తిరుపతి

కుటుంబాలలో ఆనందాన్ని నింపారు



ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మా భూముల క్రమబద్ధీకరణకు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి కృషి చేశారు. వేలాది మంది జీవితాల్లో ఆనందాన్ని నింపారు. మాకు సర్వహక్కులు లభించాయి.

– సుభాషిని, సుందరయ్య నగర్, తిరుపతి

అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు



మాకు 18 అంకణాల స్థలంలో ఇల్లు ఉంది. కష్టంలో అమ్మాలన్నా, తాకట్టు పెట్టాలన్నా వీలుకాలేదు. ఇప్పుడు సర్వ హక్కులు కల్పించడంతో భరోసా కలిగింది. అసాధ్యం అనుకున్న దాన్ని సుసాధ్యం చేసిన ఎమ్మెల్యే కుటుంబానికి రుణపడి ఉంటాం.

– సుబ్రమణ్యం, యశోదానగర్, తిరుపతి

నిషేధిత పీడ తొలిగింది



మేము 1997లో ఖాదీకాలనీలో స్థలం కొనుక్కుని ఇల్లు కట్టుకున్నాం. 2016లో మా ప్రాంతాన్ని 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారు. ఆస్తికి విలువ లేకుండా పోయింది. మా విన్నపం లేకుండానే సమస్యకు పరిష్కారం చూపారు. సాయం మరిచిపోము.

– యశోద, ఖాదీ కాలనీ, తిరుపతి

అరిగెలవారిపల్లిలో వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



గోపూజ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి: మండలంలోని పనబాకం పంచాయతీ అరెగెలవారిపల్లిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో బుధవారం తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు చిన్నారులు కోలాటాలు ఆడుతూ స్వాగతం పలికారు. గోపూజ నిర్వహించిన మోహిత్ రెడ్డి అనంతరం శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 13 రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటరత్నం, ఎస్వీ జూపార్కు డైరెక్టర్ మణి యాదవ్, వైఎస్సార్ సీపీ పంచాయతీ అధ్యక్షుడు పానేటి చెంగల్రాయులు పాల్గొన్నారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా అరిగెలవారిపల్లిలోని 300 కుటుంబాలకు జూపార్కు డైరెక్టర్ మణి యాదవ్ తన సొంత నిధులతో దుస్తుల పంపిణీ చేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్ల సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: ఇంటింటికీ రేషన్ పంపిణీకి కృషి చేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని ఎండీయూ ఆపరేటర్లు రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డిని కోరారు. తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం బుధవారం తిరుపతికి వచ్చిన ఆయనకు ఎండీయూ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కిషోర్‌కుమార్ వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ పని ఒత్తిడి తట్టుకోలేక ఎండీయూ ఆపరేటర్లు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. రెండు సార్లు వేలి ముద్రలు సేకరించాల్సి వస్తోందని, హెల్పర్ల సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. కరోనా సమయంలో ప్రజలకు సేవ చేస్తూ మృత్యువాత పడిన 62 కుటుంబాలకు ఇంతవరకు ప్రమాద బీమా అందలేదని తెలిపారు. పెండింగ్‌లోనున్న జీతాలు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీనివాసులు, జేమ్స్, చిన్నారెడ్డి, చిన్నబ్బ, తనీష్, పురుషోత్తం, వెంకయ్య పాల్గొన్నారు.

ముగిసిన ఎస్వీ శిల్ప కళాశాల వర్క్‌షాప్

తిరుపతి కల్చరల్: ఎస్వీ సంప్రదాయ శిల్ప శిక్షణ సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు చక్కటి ఉపాధి పొందేలా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకునేలా చర్యలు తీసుకుంటామని టీటీడీ జేఈవో సదా భార్గవి తెలిపారు. సంప్రదాయ ఆలయ శిల్పకళలు– అనుబంధ అంశాలపై మూడు రోజులు జరిగిన వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఇందులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మూడు రోజులు వర్క్‌షాప్‌లో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన నిష్ణాతులు విద్యార్థులకు శిల్పకళలో మెళకువలపై అవగాహన కల్పించారని తెలిపారు. భవిష్యత్తులో ఏడు రోజుల వర్క్‌షాప్ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. 3డీ యానిమేషన్ డిప్లొమా, సాయంత్రం కోర్సులు ప్రవేశపెట్టాలని విద్యార్థులు కోరారని, వీటిపైనా ఆలోచిస్తామని తెలిపారు. మహాబలిపురానికి చెందిన స్థపతి టి.కదిరివన్, బెంగళూరుకు చెందిన గోపాలక్రిష్ణ, తిరుపతి వేదిక్ వర్సిటీ వైఖానస ఆగమ విభాగం అధ్యక్షుడు టి.బ్రహ్మాచార్యులు, మైసూరుకు చెందిన స్థపతి టి.దేవేంద్ర ఆచారి పలు అంశాలపై అవగాహన కల్పించారు. టీటీడీ విద్యాశాఖాధికారి భాస్కర్‌రెడ్డి, ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రేణు దీక్షిత్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంచారజాతుల సంక్షేమ బోర్డు ఏర్పాటు హర్షణీయం

తిరుపతి కల్చరల్: కేంద్ర ప్రభుత్వం సంచార జాతుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం హర్షణీయమని సంచార జాతుల అభివృద్ధి మండలి జాతీయ కార్యవర్గ సభ్యుడు డోలా క్రిష్ణ తెలిపారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా ఇప్పటి వరకు సంచార జాతులను పట్టించుకున్న ప్రభుత్వాలు లేవన్నారు. ప్రధాని మోదీ సంచార జాతులను గుర్తించడం సంతోషకరమన్నారు. అలాగే ఓబీసీలోని సంచార జాతులను కూడా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్.గంగాధరం, పి.ప్రసాద్, బి.ఓంకార్, ఆకుల సుమతి, పవన్ కృష్ణ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతలకు అమ్మవారి చిత్రపటం అందచేస్తున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి తిరుపతికి చెందిన భక్తులు బుధవారం రూ.లక్ష విరాళం సమర్పించారు. తిరుపతి కెబీ లేఅవుట్‌కు చెందిన కడియాల లోకేష్ సాయి, సుకేష్ సాయి పేరిట కడియాల నగేష్ దంపతులు ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తిరుపతి ఓటర్ నమోదు అధికారి, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ డి.హరిత తెలిపారు. ఆమె బుధవారం ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులపై బూత్ లెవల్ అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారిని మాత్రమే కొత్తగా ఓటరుగా నమోదు చేయాలని చెప్పారు. చనిపోయిన వారి ఓట్ల తొలగింపులో వారి డెత్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పొరబాట్లకు తావు లేకుండా ఓటరు జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, బీఎల్వోలు పాల్గొన్నారు.

గుండెపోటుతో సీనియర్ పాత్రికేయుడి మృతి



నాదముని యాదవ్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి: మండలంలోని పనపాకంపేటకు చెందిన సీనియర్ రిపోర్టర్ ఆవుల నాదముని యాదవ్(62) బుధవారం తెల్లవారిజామున గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గ్రామానికి చేరుకుని ఆయన భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారికి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అగరాల సర్పంచ్ భాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు శంకర్ యాదవ్, పానేటి చెంగల్రాయులు, ఆవుల ఢిల్లీశ్వర్, అమాస నాగేశ్వరావు, అజయ్, దుర్వాసులు తదితరులు పాల్గొన్నారు. చంద్రగిరికి చెందిన పాత్రికేయులు స్థానిక టవర్ క్లాక్ సర్కిల్ వద్ద నాదముని యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జానకిరామాచారి, సోమనాథ రెడ్డి, రూప సుందర్ నాయుడు, గల్లా సుబ్రమణ్యం, భూమిరెడ్డి నరేష్, పార్థసారథి, తిరుమల రెడ్డి, చంద్రశేఖర్, రమణ, కిషోర్, మనోహర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

● హరే కృష్ణ



ఇస్కాన్ మందిరంలో విశేష అలంకరణలో రాధాగోవిందులు, పూజల్లో పాల్గొన్న అశేష భక్తజనం.
– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి